ప్రజాశక్తి

ఆదివారం 4 డిసెంబర్ 2022 5

శ్రీ సత్యసాయి





మహాసభలో ప్రసంగిస్తున్న ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్రయావ్

◆ కె-6కు కాలం చెల్లుతోందా .?

◆ కెఎల్ 1812పై రైతుల్లో నిరాసక్తత

◆ తగ్గుతున్న దిగుబడులు





కొత్తరకం వేరుశనగ కోసం.. ఎదురుచూపు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే పంట వేరుశనగ. అయితే ఈ పంటకు అవసరమైన నూతన వంగడాలు సకాలంలో అందుబాటులోకి రావడం లేదు. వేసిన రకమే వేస్తూ పోవడం మూలంగా పంటల దిగుబడులపైనా ప్రభావం పడుతోందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. పంట దిగుబడులు క్రమంగా తగ్గుతూపోవడంతో రైతులు ఆ పంట సాగుపైనే ఆసక్తి చూపే పరిస్థితి లేకుండాపోతోంది. ఒకప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 16 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట సాధారణంగా సాగయ్యేది అది ఇప్పుడు పది లక్షల ఎకరాల్లోపు వచ్చేసింది. ఈ పంటలకు ప్రధానమైన సమస్య విత్తనంలో కొత్త రకాలు ఇతర వాటిల్లో అంతగా రావడం లేదు.

దశాబ్ధకాలానికి ఒక కొత్త రకం కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో రైతులు వేసిన పంట రకాలనే వేస్తూ పోవాల్సిన వస్తోంది. 1980వ దశకం నుంచి 2005 వరకు కూడా దాదాపు మూడు దశబ్ధాల వరకు జిల్లాను శాసించినది టిఎంవి-2 అనే రకం ఒక్కటే. అది వేసివేసి దిగుబడులు తగ్గిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వచ్చింది. ఆ తరువాత కదిరి-6 రకం అందుబాటులోకి వచ్చింది. 2005 తరువాత అందుబాటులోకి వచ్చిన ఈ రకం కూడా 2015లో రీనోటిఫై చేసే రైతులకు అందజేస్తున్నారు. ఇది క్రమంగా దిగుబడి తగ్గుతూవస్తోంది. కొత్త రకాల కోసం రైతులు సైతం ఎదురు చూస్తున్నారు. ఇటీవలనే కెఎల్1812 రకాన్ని (కదిరి లేపాక్షి) రకాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ రకంపై ఆదిలోనే రైతుల నుంచి విముఖత వ్యక్తమవుతోంది.

కెఎల్ 1812పై నిరాసక్తత

కదిరి-6 స్థానంలో కెఎల్1812 రకాన్ని కదిరి వ్యవసాయ పరిశోధాన క్షేత్రం నుంచి తీసుకొచ్చారు. ఇది అటు బెట్ట, అధిక వర్షాలు రెండింటికీ తట్టుకుని నిలబడుతుందని భావించారు. అంతేకాకుండా నూనె కె-6లో 48 శాతముంటే ఇందులో 51 శాతముంటుందని భావించారు. పల్లిని తిన్న సమయంలో కాస్త చేదు వస్తోంది. ఈ ఒక్క ప్రతికూలతతో ఈ పంట సాగుపై రైతులు వెనుకడుగు వేస్తున్నారు. లేకపోతే అంతకు మునుపు ఏడాది ఈ రకం విత్తనం కోసం రైతులు పెద్దఎత్తునే పోటీపడ్డారు. క్వింటా రూ.22 వేల వరకు ధర పలికింది. గత ఖరీఫ్ నుంచి ఈ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. గత ఖరీఫ్‌లో 2.30 లక్షల క్వింటాళ్లు సబ్సిడీపై ఇస్తే అందులో 40 వేల క్వింటాళ్లు ఏపీ సీడ్స్ వద్ద మిగిలిపోయాయి. ఇందులో 25 వేల క్వింటాళ్లు కెఎల్ 1812 రకముంటే మూడు వేల క్వింటాళ్లు మాత్రమే రైతులు తీసుకున్నారు. ఇక రబీలో అయితే ఇప్పటి వరకు 32 క్వింటాళ్లు మాత్రమే తీసుకున్నారు. తీసుకోవడానికి రైతులు ముందుకు రావడం లేదు.

టిసిజిఎస్ 1694 అయినా సక్సెస్ అయ్యేనా..?

ఇప్పుడు తిరుపతి రకాన్ని తిరుపతి వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో కొత్తగా రూపొందించారు. ఇప్పుడు ఈ రకం సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మంచి దిగుబడులే ఇస్తున్నట్టు రైతులు భావిస్తున్నారు. అయితే ఇంకా ఇది ప్రాథమిక దశలోనే ఉంది. ప్రభుత్వం వైపు నుంచి కూడా నోటిఫై అవ్వాల్సి ఉంది. నోటిఫై అయి పెద్ద స్థాయిలో సాగులోకి వస్తేగాని ఇందులో అనుకూలత, ప్రతికూలతపై స్పష్టత వచ్చే పరిస్థితి లేదు. మొత్తంగా వేరుశనగ సాగులో పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా దిగుబడులు పెరిగే కొత్త రకాలు అందుబాటులోకి రావడం లేదన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. దిగుబడులు పెరిగే మంచి రకాలు ఎప్పటికప్పుడు అందుబాటులోకి రాకపోతే వేరుశనగ సాగు జిల్లాలో కష్టసాధ్యమవుతుందని వ్యవసాయ నిపుణులు సైతం చెబుతున్నారు.

విద్యావ్యవస్థను నాశనం చేస్తున్న బిజెపి

◆ విద్యార్థి సమస్యలపై సంఘటితంగా ఉద్యమం

◆ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్రయాదవ్

◆ పుట్టపర్తిలో విజయవంతంగా జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విద్యావ్యవస్థను నాశనం చేసే విధానాలను తీసుకువస్తోందని, దీనిని ద్వారా పేద విద్యార్థులు విద్యకుదూరం అవుతున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్రయాదవ్ పేర్కొన్నారు. పుట్టపర్తిలోని ఎనుమలపల్లి వద్ద ఉన్న ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆసంఘం జిల్లా 4వ మహాసభలను శనివారం నిర్వహించారు. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన సూర్యచంద్రయాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలను వేగంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. అందులో భాగంగా ఇటీవల ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని చెప్పారు. దీనివల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మోడీ అడుగులకు మడుగులు ఒత్తేలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. నియంతృత్వ పోకడతో పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వానికి విద్యార్థి లోకం ఐక్య పోరాటాలతో బుద్ధి చెప్పాలన్నారు. నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి కేంద్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలు, డిగ్రీ, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ఇలాంటి వాటికి బుద్ధి చెప్పేందుకు విద్యార్థులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఉచిత నిర్బంధ విద్యను సాకుగా చూపి కేవలం 9, 10 తరగతి విద్యార్థులకే ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను పరిమితం చేయడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని రద్దు చేసి గతంలో మాదిరి విద్యార్థులందరికీ దీనిని వర్తింజేయాలని డిమాండ్ చేశారు. సత్యసాయి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ యూనివర్సిటీ, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగర్జున, బాబావలి, ఉపాధ్యక్షులు బాబ్జాన్, చంద్రశేఖర్, పుట్టపర్తి నాయకులు పవన్, గణేష్, గుణనాథ్‌తో పాటు జిల్లాలోని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళకు ఇదేం ఖర్మ పోస్టర్‌ను అందజేస్తున్న టిడిపి నాయకులు

'ఇదేం ఖర్మ' పోస్టర్లు విడుదల

కనగానపల్లి : మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అనే పోస్టర్లను టిడిపి నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత మండల అధ్యక్షులు బట్టా సురేష్‌చౌదరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలు, దాడులు తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. ఇందులో భాగంగా నాయకులు టిడిపి ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్థతను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజలు నుంచి కూడా తమ పార్టీకి మద్దతు పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు కాసుమూర్తి వెంకటేష్, ఎంపిటిసి బిల్లే భాస్కర్, నెట్టెం శీనా, బట్టా తిరుపాలు, మాదినేని సుబ్రహ్మణ్యం, బట్టా శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహాసభను జయప్రదం చేయండి

బత్తలపల్లి : విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 7న నిర్వహించనున్న జయహో బిసి మహాసభను జయప్రదం చేయాలని ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సిఎం జగన్ బిసిలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అనేక పార్టీలు ఇన్నాళ్లుగా బీసీలను ఓటుబ్యాంకుగా వాడుకుంటే వైసిపి అధికారంలోకి వచ్చాక అక్కున చేర్చుకుందన్నారు. కావున మహాసభకు బీసీలంతా పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని మార్కెట్ వీధిలో ఉన్న మార్కండేయస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి భావన రుషీంద్రుల మూలవిరాట్, వినాయక, కాశీవిశ్వేశ్వర, ఆంజనేయస్వామి, శిలింగం, నవగ్రహ విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులు, వేదమంత్రోచ్ఛరణల మధ్య వేద పండితులు ప్రతిష్టించారు. ఈ సందర్భంగా పుణ్యాహవాచనం, అగ్ని ప్రణయానికి బబారాధనం, ఉత్తరోమాలు, యంత్రరత్నతోపాటు సాయంత్రం మహాశాంతి అభిషేకం, యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, అఖిల భారత పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు కండగట్టుస్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, జాతీయ చేనేత దినోత్సవ రూపకర్త వెంకన్న, సభ్యులు జింకా నాగభూషణం, గోలి నాగభూషణం, గడ్డం రామకృష్ణ, జింకా మోహన్‌బాబు, కట్టా గోవిందు, పొలంకి పెద్దరెడ్డప్ప, జింకా రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.



శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు, నాయకులు

పీడీఎఫ్ అభ్యర్థి నాగరాజును గెలిపించుకుందాం

◆ నిరుద్యోగులు, యువత గొంతుకగా మండలికి పంపాలి

◆ ప్రజాసంఘాల విస్తృత స్థాయి సమావేశంలో నేతల పిలుపు



ప్రజాసంఘాల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వెనుకబడిన ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన నిరంతరం శ్రమిస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు బాటలు వేద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు విజయాన్ని కాంక్షిస్తూ సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఆవాజ్, కెవిపిఎస్, ఎన్‌పిఆర్‌డి, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘం, పండ్ల తోటల రైతుసంఘం తదితర ప్రజాసంఘాల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం, అందరికీ విద్య, వైద్యం, వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి, ప్రతి ఒక్కరికీ ఉపాధి కోసం పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. పాలక, ప్రతిపక్ష పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎలాంటి ప్రజా ఉద్యమాల చరిత్ర లేదన్నారు. కోట్ల రూపాయల డబ్బును వెదజల్లి గెలవాలని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చి అధికార బలం, ధనబలంతో గెలవాలని చూస్తున్నారన్నారు. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి ఏనాడూ శాసనమండలిలో ప్రజల సమస్యలపై మాట్లాడింది లేదన్నారు. ఆయన కుమారుడే తిరిగి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ రోజూ ప్రజా సమస్యలపై మాట్లాడని నేతలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇస్తే వాటిపై ఏ రోజు మాట్లాడింది లేదన్నారు. బిజెపితో పగలు కొట్లాడుతున్నట్లు నటిస్తూ, రాత్రిపూట ఆ పార్టీ నేతలతో మిలాకత్ అవుతున్నారన్నారు. ఇలాంటి వారికి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు బుద్ధి చెప్పాలన్నారు. సిపిఎం ప్రజాసంఘాల నేతలు గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకుని పోతుల నాగరాజు గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరి, క్రిష్ణమూర్తి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వైటిసి,రమేష్, వరూర్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, వికలాంగుల ఐక్య వేదిక కార్యదర్శి రామయ్య, పండ్ల తోటల రైతు సంఘం శ్రీనివాసులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎదురీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

'ఎదురీత' నేర్పుతుంది..!

సిఐటియు జిల్లా నాయకులు వి.రాంభూపాల్

ఉన్నం వెంకటేశ్వర్లు 'ఎదురీత'పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

తాను నమ్మిన సిద్ధాంతం కోసం అనేక అవరోధాలు, ఆటంకాలు ఎదురైనా ఏరకంగా ఎదురీత చేయవచ్చునో తెలిపే పుస్తకమే 'ఎదురీత' అని సిఐటియు జిల్లా నాయకులు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. ఉన్నం వెంకటేశ్వర్లు రచించిన 'ఎదురీత' పుస్తకాన్ని శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఇందులో సిఐటియు, ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘం, కెవిపిఎస్, అంగన్‌వాడీ తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఎదురీత పుస్తక రచయిత ఉన్నం వెంకటేశ్వర్లు చిన్నతనం నుంచి పోలియోతో వైకల్యం పొందినా ఎక్కడా వెరవకుండా ప్రజా సమస్యల కోసం పోరాటం సాగించారన్న విషయాలను తెలియజేసే ప్రయత్నం చేసారని పేర్కొన్నారు. వామపక్ష ఉద్యమాలను చిన్న తనంలోనే రూపొందించేందుకు ఏ రకంగా పనిచేసారో వివరించారన్నారు. అంతటితోనే ఆగకుండా వామపక్ష పత్రికకు సంబంధించిన జర్నలిజం కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ అనేక మందికి ప్రజా జర్నలిజం పాఠాలను నేర్పడమే కాకుండా, ప్రజా దృష్టిలో ఉంచి వార్తలను ఏ రకంగా రాయాలనే విషయాలను నేర్పించారని తెలిపారు. ఇప్పుడు అనేక మంది ఇతర పత్రికల్లోనూ ఈయన వద్ద శిక్షణ పొందిన పాత్రికేయులు పాత్రికేయరంగంలో రాణిస్తున్నారన్నారు. వయోభారం, వైకల్యం వెన్నాడుతున్నా ఆయన ఇప్పటికీ ప్రజా సమస్యలు, పోరాటాల గురించి ఆలోచిస్తూనే ఉంటారన్నారు. ఒక వ్యక్తి గట్టిగా సంకల్పిస్తే ఎన్ని ఇబ్బందులున్నా ప్రజల కోసం పనిచేయోవచ్చునో తెలియజేసే విధంగా ఆయన జీవితం ఉంటుందన్నారు. ఇలాంటి వారిని చూసి ప్రజా సంఘాల్లో పనిచేసే వారు కూడా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నాగమణి, నాగేంద్రకుమార్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజినేయులు, కృష్ణమూర్తి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కెవిపిఎస్ నాయకులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ సాయి మనోహర్, జెడ్పీటీసీ కోటి సుధ సూచించారు. శనివారం స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలు ఏ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తారో వాటిపై పూర్తి సమాచారంతో ఉండాలన్నారు. ముఖ్యంగా సమస్యలపైన అవగాహన ఉండాలన్నారు. జెడ్పీటీసీ కోటి సుధ మాట్లాడుతూ విధులకు హాజరుకాని వారిని, విధులను సక్రమంగా నిర్వర్తించని వారిని తొలగిస్తామని హెచ్చరించారు. గ్రామంలో ఉన్న అనేక సమస్యలను గుర్తించి చర్చించారు. ప్రధానంగా నీటి సమస్య, డ్రెయినేజీ, హౌసింగ్ తదితర సమస్యలను వివరించి వాటిని పరిష్కరించేందుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సర్పంచు ఆక్కిం కాశమ్మ, కార్యదర్శులు రామాంజనేయులు అశోకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిడిఒ సాయి మనోహర్, జెడ్పీటీసీ, కోటి సుధ, సర్పంచు కాశమ్మ

ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు



ధర్మవరం టౌన్ : టిడిపి ఎస్సీసెల్ శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన కేశగాళ్ల శ్రీనివాసులను నియమించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధికి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి పరిటాల సునీత, నియోజకవర టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌కు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఆర్డీవో తిప్పేనాయక్

ఓటుహక్కుపై అవగాహన కల్పించాలి

ఆర్డీవో తిప్పేనాయక్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఓటుహక్కుపై ప్రజలతోపాటు యువతీ, యువకులకు అవగాహన క్పించాలని ఆర్డీఓ తిప్పేనాయక్, మున్సిపల్ కమిషనర్ మమల్లికార్జున సూచించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం సమావేశ భవనంలో ధర్మవరం అర్బన్, రూరల్ పరిధిలోని 158 మంది బిఎల్‌ఒలకు ఓటు నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటుహక్కుతోనే మంచి పరిపాలనాదక్షున్ని ఎన్నుకోవచ్చన్నారు. దీంతో దేశప్రగతి సాధ్యమవుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకులు ఓటుహక్కును పొందాలన్నారు. ఓటుహక్కుపై యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 10న ఎలక్ట్రోల్ పరిశీలకులు మురళీధర్‌రెడ్డి రానున్న నేపథ్యంలో బిఎల్‌ఎలు శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్‌ల్లో ఫారం 6, 7పై ప్రజలకు అవగాహన కల్పించి క్లైయిమ్స్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ఎన్నికల తహశీల్దార్ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను భ్రష్టుపట్టించిన వైసిపి : చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



ప్రజలతో మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

వైసిపి అధికారంలోకి వచ్చాక చేనేత పరిశ్రమను భ్రష్టుపట్టించిందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. సేవ్ ధర్మవరం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సాయినగర్, సిద్ధియ్యగుట్టలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిలకం మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక కార్మికులకు అందే పథకాలన్నీ నిలిపివేశారన్నారు. కేవలం నేతన్న నేస్తం మాత్రమే ఇస్తున్నారని, అది కూడా ఆనర్హులకే ఎక్కువగా ఇస్తున్నారని ఆరోపించారు. ముడిపట్టు ధరలు రెండింతలు పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేనేత పరిశ్రమను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. అంతేకాకుండా పెరిగిన ధరలతో ప్రజలకు కుటుంబ పోషణ భారమైందన్నారు. కావున పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు.

జూనియర్ కళాశాలలో అవినీతి రాజ్యం

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవినీతి రాజ్యమేలుతోందని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పెనుకొండ సబ్‌కలెక్టర్‌కు శనివారం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బషీర్ అహ్మద్ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల నుండి యూనిఫామ్, ఐడి కార్డులు సంబంధించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారన్నారు. కళాశాల మెయింటెనెన్స్ కు సంబంధించి సీసీ కెమెరాలు, పవర్ సప్లై, పాత పేపర్ల అమ్మకం ఇలా పలు వాటిలో కళాశాల సొమ్మును దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఆయన పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్థసారథి, బోయ హరికృష్ణ, హరీష్, సాయికిరణ్, షబ్బీర్ భాష, నరేష్, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

అన్నదానానికి 'గోనుగుంట్ల' విరాళం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 14న చేపట్టనున్న అన్నదాన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విరాళం అందజేశారు. ఈమేరకు అనంతపురంలోని నిరిన్ సాయి కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు శనివారం రూ.20వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గోనుగుంట్లను శాలువాతో సత్కరించారు.

ఓటరు నమోదు తప్పనిసరి

కొత్తచెరువు : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఓటరు నమోదుకు మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ బిఎల్ఓలు అందుబాటులో ఉన్నారని చెప్పారు. కొత్తచెరువులోని శివ సాయి డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి ఆర్ఐ వలి, వీఆర్వో వేణుగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గాండ్లపెంట : మండల పరిధిలోని గాజులవారిపల్లి పెద్ద తండా పంచాయతీలోని కట్టుబాయి తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎంపిపి జగన్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు తాము ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవటంతో స్పందించిన ఎంపిపి తన సొంత నిధులతో గ్రామంలో బోరుబావిని తవ్వించారు. నీరు పుష్కలంగా లభించడంతో శనివారం బోరుమోటరును బిగించినట్లు ఎంపిపి చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి బి. శాంతమ్మ ఎంపీటీసీ గోపాల్ నాయక్ వ బి సుధాకర్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కర్నాటక మాజీ సిఎం కుమారస్వామి రాక

మడకశిర: కర్నాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్ డి కుమారస్వామి ఆదివారం మడకశిరకు రానున్నట్లు వక్కలిగ సంఘం అధ్యక్షులు, జెడ్పీటీసీ అనంతరాజు తెలిపారు. పంచరత్న రథ యాత్రలో భాగంగా కర్నాటకలోని పావగడకు ఆయన వెళ్లనున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన మడకశిర మీదుగా వెళ్తున్నారన్నారు. ఈసందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి మడకశిర ప్రాంతంలోని కుంచిటిగ సామాజికవర్గం వారు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అనంతరాజు కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తెలిపారు. శనివారం పుట్టపర్తి మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, 104 వైద్యాధికారి మురళీ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు, ప్రజలకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, సూపర్ వైజర్లు వెంకట రమణ, చంద్రకళ, ఎఎన్ఎంలు హెచ్పి అపర్ణ, ఆరోగ్య కార్యకర్త నాగజ్యోతి, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, శ్రీదేవి, లక్ష్మీనరసమ్మ, 104 సిబ్బంది లక్ష్మీపతి, అబ్బుల్లా తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నియోజకవర్గ మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా పొగాకు షబ్బీర్‌బాషా

ఓబులదేవరచెరువు : టిడిపి పుట్టపర్తి నియోజకవర్గం మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా పొగాకు షబ్బీర్‌బాషాను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన వారందరికీ కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. వారు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మందోజీఆరీఫ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, రాజారెడ్డి, షాను తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో గత నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉస్తిలిపల్లికి చెందిన మైనార్టీ యువకుడు హుసేన్ బాషా కుటుంబానికి జనసేన నాయకులు ఆర్థికసాయం అందజేశారు. మృతునిభార్యకు 10 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో కొట్టి అశ్వర్థ కుమార్, (లాయర్), మండల కన్వీనర్ కె.వి. రమణ, బాలసముద్రం ఎంపీటీసీ అమర్ కార్తికేయ, కొట్టి అనిల్, గోవిందు, బాలకృష్ణ, శ్రీనివాసులు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండలమీట్

అగళి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా కొనసాగింది. ఎంపిపి రేణుక కామరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు సభ్యులు తమ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పలు సమస్యలను సభ్యులు సమావేశంలో ప్రస్తావించినప్పటికీ ఏ ఒక్కదానికి కూడా స్పష్టమైన సమాధానాన్ని అధికారులు ఇవ్వకపోవటంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించలేని సమావేశాలను తూతూమంత్రంగా నిర్వహించడం ఎందుకు అని సభ్యులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమేష్, ఎంపీడీవో శ్రీనివాస్, తహశీల్దార్ జిలానీతో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ ఏర్పాటుకు గ్రామసభ

అగళి :మండలంలోని హెచ్‌డి హళ్లిలో క్వారీ ఏర్పాటుకు ప్రజామోదం కోసం శనివారం గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ క్వారీ ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ అధికారులు భూమి రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

హిందూపురం : విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి పేర్కొన్నారు. వారం రోజులుగా హిందూపురం ఎన్ఎస్‌పిఆర్. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్, నాంది ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సహకారంతో జరుగుతున్న ఉద్యోగ నైపుణ్యాల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు సభలో ప్రిన్సిపల్ డాక్టర్ యం.ప్రగతి శిక్షణ పొందిన విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన మహీంద్రా సంస్థను అభినందించారు. ఈ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆరుగురు విద్యార్థినులకు ట్రోఫీలు అందజేశారు. శిక్షకులు మస్తాన్, అజయ్‌ను ప్రిన్సిపాల్, విద్యార్థినులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తిరుమలమ్మ, యశోదరాణి, ప్రకాష్‌రావు, రవినాయక్ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కదిరి రూరల్ సిఐగా సూర్యనారాయణ

కదిరి టౌన్ : కదిరి అప్‌గ్రేడ్ రూరల్ సిఐగా సూర్యనారాయణ బాధ్యతలు స్వీకకరించారు. ఈ మేరకు ఆయన శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత రెవెన్యూ రాయల్స్

హిందూపురం : పట్టణంలోని ఎంజీఎం మైదానంలో జరుగుతున్న రెవెన్యూ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా రెవెన్యూ రాయల్స్ జట్టు నిలచింది. శనివారం వార్డు అడ్మిన్ సెక్రటరీల జట్టు, రెవిన్యూ రాయల్స్ జట్టుల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో ప్రతిభ కనబర్చిన రవి తేజ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. విజేతలకు డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు ట్రోఫిని అందించి అభినందించారు.

టిడిపి నియోజకవర్గ మైనార్టీ కార్యదర్శిగా ఇర్షాద్

ఓబులదేవరచెరువు : తెలుగు దేశం పార్టీ పుట్టపర్తి నియోజకవర్గం మైనారిటీ కార్యదర్శిగా గండికోట ఇర్షాద్ ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, ఆర్ఎంపీ జాకీర, కొండా ఈశ్వరయ్య, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

వి(చి)త్తశుద్ధి ఉందా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా రైతాంగానికి కష్టాలు తప్పడం లేదు. అప్పుడు వర్షాల్లేక పంటలు సరిగా పండలేదు...ఇప్పుడు వర్షాలు వచ్చి పంట చేతికందకుండాపోతోంది. అధిక వర్షాలతో చీడపీడలు రైతాంగాన్ని చుట్టుముడుతున్నాయి. వేరుశనగ కాదని కొంత వరకు పత్తి పంట వైపు మొగ్గుచూపారు. 54 శాతం అధికంగా పత్తిపంట సాగైంది. సుమారు ఒకటిన్నర లక్షల ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. ఎకరానికి సగటున రూ.50 వేల వరకు ఖర్చు పెట్టారు. తీరా ఇప్పుడు పంట దిగుబడిచూస్తే ఏ మాత్రం లేకుండాపోతోంది. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేక రైతులు దిగాలు చెందుతుతున్నారు. ఈ పంట నష్ట పరిశీలనకు వ్యవసాయ శాస్త్రవేత్తలను సైతం పంపించింది. వారు పరిశీలించారు. ప్రధానంగా అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయని నివేదికలిచ్చారు. కొంత విత్తన నాణ్యతలోనూ లోపాలున్నట్టు గుర్తించినప్పటికీ ధ్రువీకరించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇది ధ్రువీకరించడానికి విత్తన పంపిణీలో లోపాలే కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్‌లో పత్తి విత్తనాలను నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది డీలర్లు రైతులకు అంటగట్టారు. తెలంగాణాలోని బూత్‌పూర్ నుంచి తీసుకొచ్చి రైతులకు అందజేశారు. వీటికి సంబంధించి బిల్లులు కూడా రైతులకు ఇవ్వలేదు. పంట బాగుంటుందని పెట్టిన రైతులకు ఇప్పుడు పంట ఏ మాత్రం దక్కే పరిస్థితి లేదు. దీంతో పంట నష్టపోయిన రైతుల వద్ద బిల్లులు లేవన్న పేరుతో పంట నష్టం రావడం కూడా సందేహాస్పదంగానే మారుతోంది. దీనికి బీమాను వర్తింపజేస్తారా లేదా అన్న సందేహాలు సైతం రైతుల్లో నెలకొన్నాయి. దీనిపై ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు జరిపింది. 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా సైతం నిర్వహించేందుకు పిలుపునిచ్చింది. ఇక ఇతర పంటలకు చీడపీడలు వెంటాడుతూనే ఉన్నాయి. మిరప నల్లి తెగులు భయపెడుతోంది. దీని నివారణ కోసం రైతులు పురుగుల మందులు పెద్ద ఎత్తున ఈ ఏడాది వినియోగిస్తున్నారు. అరటికి సిగటోమా పట్టుకుంది. పంట చేతికొచ్చాక వస్తున్న ఈ సిగటోమా వల్ల వ్యాపారులు పంటను కొనేందుకు ముందుకు రావడం లేదు. దీని నుంచి రక్షించుకునేందుకు పురుగుల మందులు వాడుతున్నారు. ఈ రకంగా అనధికారిక అంచనా ప్రకారమే ఈ ఏడాది పురుగుల మందుల వ్యాపారం మూడొంతులు పెరిగిందని చెబుతున్నారు. ఎప్పుడూలేని విధంగా వర్షాలొచ్చి బయటకు అంతా పచ్చిగా కనిపిస్తున్నా...లోన పురుగు తొలిచేస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా



నష్టపోతున్నారు. నష్టపోతున్న రైతాంగానికి ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటుందన్న దానిపై అధికారిక ప్రకటనేదీ ప్రభుత్వం చేయలేదు. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నాయకులు మాత్రం పోటాపోటీగా ఇతర అంశాలపై విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. ఒకరిపై ఒకరు సవాల్లు విసురుకుంటున్నారు. అసలైన సమస్యలపై ఏ మాత్రం చర్చ జరగడం లేదు. రాప్తాడు నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీల నాయకులు ఈ వారంలోనూ పెద్దఎత్తున ఆరోపణలు చేసుకోవడమే కాకుండా పరస్పరం ఎస్పీకి ఫిర్యాదులు సైతం చేసుకున్నారు.

భూపోరాటాలు ఉధృతం : వ్యకాసం



రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

భూ పోరాటాలను ఉధృతం చేస్తామనివ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు శనివారం ముగిశాయి.ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంఘం పోరాటంలో చురుకుగా పాల్గొన్న కార్యకర్తలు 60 మంది తో ప్రతినిధుల మహాసభ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా గత మూడు సంవత్సరాల నుంచి సంఘం చేసిన పోరాటాలు ఫలితాలపై సమీక్షించి పోరాటాల కొనసాగింపుపై చర్చించారు. 2023 జనవరి నెల నుండి జిల్లా వ్యాప్తంగా భూమి లేని పేదలను గుర్తించి భూ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నూతన జిల్లా కమిటీని 15 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్ష , కార్యదర్శులుగా ప్రవీణ్ కుమార్, పెద్దన్న , కోశాధికారిగా రమేష్ , ఆఫీస్ బేరర్స్‌గా ఊటకూరు నాగరాజు, గంగాధర్, వెంకట లక్ష్మమ్మతో పాటు తొమ్మిది మంది జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులతో కలిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర మహాసభలకు ప్రతినిధులుగా జిల్లా నుండి 8 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ , అచ్చమ్మ , బాలస్వామి , నారాయణ , హనుమంతు , సరోజమ్మ , శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదాం

ప్రజాశక్తి-హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పట్టణ వ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని కల్లూరు సుబ్బారావు పార్కులో పట్టణంలోని ఆటో కార్మికులతో సిఐటియు నాయకులు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులందరు తమ సమస్యల పరిష్కారానికి సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతూ రోజు రోజుకు ఆటో కార్మికులపై పోలీసులు, ఆర్‌టిఎ అధికారుల వేధింపులు, దాడులు ఎక్కువ అవుతున్నాయన్నారు. కార్మికుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్, నాయకులు రామకృష్ణ, అత్తర్‌బాబా, కల్లూరు ఆటో స్టాండ్ అధ్యక్షులు నరేష్, కార్యదర్శి రఫీ, మోదా సురేష్, రామాంజి, అంజి, అతావుల్లా, నాగరాజు, నాగేష్, సునీల్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

రొద్దం : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంపిపి చంద్రశేఖర్ ఉపాధ్యాయులను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం మండలంలోని లోచర్ల ఎంపిపి పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నభోజనం రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనంతాచారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, మైనార్టీ నాయకులు వజీర్‌బాషా, స్థానిక సర్పంచి గంగాధర్, సోమిరెడ్డి, డీలర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

బుక్కపట్నం : అసాంఘిక కార్యకాలపలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలువలలో పంట పొలాల్లో కంచెకు కరెంటు వదలడం చట్టారీత్యా నేరమన్నారు. అడవి జంతువుల కోసం కరెంటు వదిలి ప్రమాదాలు జరిగితే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, ఎఎస్ఐ రమణ సిబ్బంది పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న డీఎస్పీ

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర స్థాయి సదస్సు పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి మడకశిర రూరల్

తాడేపల్లిలో జరిగే ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర విస్తతస్థాయి కార్యవర్గ సదస్సు పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ మాదిగ ఉప కులాలకు, షెడ్యూల్ కులాలకు చాలా సమస్యలున్నాయన్నారు. వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని చెప్పారు. షెడ్యూల్ కులాల రిజర్వేషన్ విభజన చట్టబద్ధత సాధించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు అంజనప్ప, తాలూకా అధ్యక్షులు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు అంజి, నాయకులు నరసింహమూర్తి, చందు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఏకపాదంపల్లిలో చోరీ

తాడిమర్రి : మండలంలోని ఏకపాదంపల్లి గ్రామ పంచాయతీ గొంగటి మంజుల ఇంట్లో శుక్రవారం రాత్రి ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. బీరువాలో రెండు జతల కమ్మలు, 3 ఉంగరాలు, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాజ్యాంగ వారోత్సవాలు

కదిరి టౌన్ : భారత రాజ్యాంగం దేశప్రజల పవిత్రగ్రంథం అనిమండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎంకటేశ్వరరావు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల ముగింపు సదస్సును శనివారం స్థానికబ్లూ మూన్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించారు. బ్లూమూన్ సంస్థల చైర్మన్ శివశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్జి మాట్లాడుతూ రాజ్యాంగం యొక్క ఔన్నత్యాన్ని వివరించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు ప్రతిమ, మీనాక్షి, సుందరి, న్యాయవాదులు లోకేశ్వర్ రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో బిసిలకు పెద్దపీట : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తున్నారనిఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన నిర్వహించ తలపెట్టిన జయహో బీసీ మహాసభ పోస్టర్లను శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి నివాసంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శంకరనారాయణతో కలసి, పి వి సిద్దా రెడ్డి విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలకు పెద్దపీట వేసిన జగన్‌కు ఆయనకు ధన్యవాదాలు తెలిపే జయహో బిసి మహాసభను ఈనెల 7న విజయవాడలో నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఈనెల 5న కర్నూల్‌లో నిర్వహించే రాయలసీమ గర్జన కార్యక్రమానికి వైసిపి మద్దతు తెలుపుతోందన్నారు. ఈమహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాదిక్, గోపాలకృష్ణ, రాము, ప్రసాద్, ఎస్‌కె. వలి, ధనుంజయ, నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు విడుదల

మడకశిర : వైసిపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై టిడిపి చేపడుతున్న ఇదేమీ కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శనివారం విడుదల చేశారు. పట్టణం లోని బాలాజీ నగర్లోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ ఉమాశంకర్, క్లస్టర్ పట్టణ ఇన్‌చార్జి నాగరాజు, రూరల్ ఇన్‌ఛార్జికన్నా, జిల్లా నాయి బ్రాహ్మణ సాధికార అధ్యక్షులు రామాంజనేయులు తదితరులు. పాల్గొన్నారు

సామాజిక న్యాయం వైసిపితోనే సాధ్యం

హిందూపురం : రాష్ట్రంలో సామాజిక న్యాయం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైసిపితోనే సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పేర్కొన్నారు. ఈ నెల 7న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే జయహో బిసి మహాసభకు సంబంధించిన కరపత్రాలను, గోడపత్రికలను శనివారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయ ఆవరణంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగభూషణం, కౌన్సిలర్లు నాగేంద్ర బాబు, మణి, రోషన్ అలీ, అయూబ్, ముస్తాక్, రహమత్‌బి, బాబు, సంతేబిదనూర్ రాము, బీసీ నాయకుడు శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చిలమత్తూరు విద్యార్థి

చిలమత్తూరు : స్కూల్ ఆఫ్ గేమ్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిసెంబర్ 1 న పామిడిలో నిర్వహించిన జిల్లా స్థాయి యు-44 వాలీబాల్ బాలుర విభాగం పోటీల్లో చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మధు ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శేషాచలం, పీడీ రంగస్వామి తెలిపారు. పలనాడు జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో మధు పాల్గొంటారని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థి మధును పాఠశాల సిబ్బంది అభినందించారు.

టిడిపికి పూర్వవైభవం తెద్దాం

కదిరిటౌన్ : రాబోయే ఎన్నికల్లో టిడిపికి పూర్వవైభవం తేవటానికి కందికుంట గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ విభాగం నూతన కమిటీనిలో తన నియామకానికి సహకరించినందుకు రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో నాయకులు కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, రమణ, ముని కుమార్, రామాంజినేయులు, రెడ్డెప్ప, నాగబయప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

పుట్టపర్తి అర్బన్ : వైసిపి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తోందని స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సాయి నగర్ లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైసిపికార్యాలయంలో కొత్తచెరువుకు చెందిన 140 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్ సాయి గీత, సూర్య గౌడ్, చెరువు భాస్కర్ రెడ్డి, నాయకులు ఫోటో సాయి, ఎస్‌టిడి నరసింహులు, కవిత తదితరులు పాల్గొన్నారు.

మడకశిర నగర పంచాయతీ పరిధిలోని మల్లినాయకనపల్లి, చౌవిటిపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లిప్రభుత్వం నుండి లబ్ధి పొందిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం : టిడిపి



రొద్దం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ధర్మవరం టౌన్ : దోచుకోవడం.. దాచుకోవడం తప్ప వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి శూన్యమని టిడిపి నాయకులు విమర్శించారు. శనివారం పట్టణంలోని 14వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు పెరిగిన ధరలపై ఆరాతీశారు. ముఖ్యంగా నిత్యావసర సరుకుల ధరలు, ఇసుక మాఫియా, అభివృద్ధి పనులు, తాగునీరు. నిరుద్యోగం, కరెంటు సమస్య, రైతులకు గిట్టుబాటు ధర, మహిళా భద్రత వంటి వాటిపై ప్రజలు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. అంతేగాకుండా ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమతం కాటమయ్య, ఫణికుమార్, చింతలపల్లి మహేష్‌చౌదరి, చింతపులుసు పెద్దన్న, మేకల రామాంజనేయులు, విజయ్‌సారధి, రాంపురం శీన, కెహెచ్ ప్రకాష్, పరిశే సుధాకర్, నాగూర్‌హుస్సేన్, కొతపేట అది, కేశగాళ్ల శీనా, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు :- మండల పరిధిలోని తుమ్మలకుంట్లపల్లి , పెద్ద సానివారి పల్లి గ్రామాల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జయచంద్ర , ప్రధాన కార్యదర్శి పిట్ల సుధాకర్ , డాక్టర్ జాకీర్, కొండ ఈశ్వరయ్య, జయచంద్ర రెడ్డి, చాంద్‌బాషా, షబ్బీర్, షాను, ఓబుల్ రెడ్డి, కంచి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలం, వైసిపి హయాంలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారధి విమర్శించారు. మండలంలోని తురకాలపట్నం గ్రామంలో శనివారం నిర్వహించిన ఇదేమి ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, కన్వీనర్ నరహరి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు రామక్రిష్ణప్ప, మాధవనాయుడు, మాజీ కన్వీనర్ చంద్రమౌళి,ట్రైలర్ ఆంజనేయులు, ఈసీ హరీష్, అశ్వర్థనారాయణ, లీలావతి, సర్పంచి మంజు, తురకాలపట్నం నాగేంద్ర, బోయ శ్రీనివాసులు, ఉప్పర శ్రీనివాసులు, హరికృష్ణ, షణ్ముఖ, లక్ష్మీపతి, శ్రీరామ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణానికి రాష్ట్రపతి చేతుల మీదుగా శంకుస్థాపన

ప్రజాశక్తి బుక్కపట్నం

342 జాతీయ రహదారి నిర్మాణానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్ విధానం ద్వారా ఆదివారం శంకుస్థాపన చేయనున్నారని ఎన్‌హెచ్ డివిజన్ అధికారి డి.మధుసూదన్ రావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో చేపడుతున్న శిలాఫలకం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో నేవీ డే వేడుక లో రాష్ట్రపతి పాల్గొంటారని అనంతరం శ్రీ సత్య సాయి జిల్లాలో చేపట్టే 342 జాతీయ రహదారి పనులకు రాష్ట్రపతి వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేస్తారని వివరించారు. 342 జాతీయ రహదారి పనులకు సంబంధించి మొదటి విడతలో జిల్లాలోని ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం క్రాస్ వరకు 32 కిలోమీటర్ల రహదారి పనులు 8 మీటర్ల వెడల్పుతో రూ. 402కోట్ల రూపాయలతో చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ బసంత్ కుమార్, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, జాతీయ రహదారి అధికారులు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

మూడు రాజధానులతోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి మడకశిర రూరల్

మూడు రాజధానుల ఏర్పాటుతోనే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయ రాజధానికి కావలసిన అర్హతలన్నీ కర్నూలుకు ఉన్నాయని, దీంతో పాటుగా ప్రధాన నగరాలైన హైదరాబాద్ బెంగళూరు,తిరుపతి, విజయవాడ మొదలైన పట్టణాలన్నీ దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. మూడు రాజధానులను వ్యతిరేకిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు రాయలసీమ ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారని విమర్శించారు. రాయలసీమలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా కర్నూలును న్యాయ రాజధానిగా చేయడానికి మద్దతు తెలుపకపోవడం చూస్తుంటే రాయలసీమ పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్, సింగిల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, ఎంపీపీ కవిత సత్యనారాయణ, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు గౌడ్, సర్పంచి ప్రభావతి దేవల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన

పుట్టపర్తి : ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన రుణమేళ సదస్సు పుట్టపర్తి లోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిక్కి రాష్ట్ర అధ్యక్షులు రాజమహేంద్రనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలలో ఉన్న నిరుద్యోగుల అభ్యున్నతి కోసం ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ పనిచేస్తుందన్నారు ఔత్సాహులకు పరిశ్రమ స్థాపన కొరకు కావలసిన అవగాహన, ప్రాజెక్టు తయారీలో సూచనలు సలహాలు తోపాటు ఇండస్ట్రియల్ ఏర్పాటుకు అవసరమైన సహకారాన్ని అందిస్తుందని తెలిపారు ఈకార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా, జిల్లా ఎల్‌డిఎం సాయినాథ్ రెడ్డి, సత్య సాయి జిల్లా సిక్కి కోఆర్డినేటర్ యనమల ప్రసాద్, సుధాకర్,వివిధ మండలాల నుండి వచ్చిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



మీకోసం

ఒక గ్లాసు గోరువెచ్చటి నీటిలో కొద్దిగా పటిక బెల్లం, నిమ్మరసం కలిపి తాగితే కఫం కరిగిపోయి పొడిదగ్గు తగ్గుతుంది.

జీవన సౌరభం

ఎవరైనా మనకిచ్చేది తాత్కాలికమే.. కృషితో మనం సంపాదించుకున్నదే శాశ్వతం.

అహం పనికిరాదు



ఒక అడవిలో తెల్ల పక్షులు, నల్ల పక్షుల సమూహాలు జీవిస్తున్నాయి. తెల్ల పక్షులు చాలా గర్వంగా ఉండేవి. ఆ జట్టు నాయకుడు నల్ల పక్షులు కనిపించిన ప్రతిసారీ హేళన చేస్తూ ఉండేవారు.

'ఈ సృష్టిలో అందమంతా మా సొంతం. మీరు నల్లగా, పొడవైన గోళ్ళతో, వాడిగల ముక్కుతో చూడటానికే అసహ్యంగా కనిపిస్తున్నాయి. అందువల్ల మా జాతి ఈ భూప్రపంచంలోనే గొప్ప' అని బీరాలు పలికాడు.


'అందమనేది శాశ్వతం కాదు. కొంతకాలానికి అది నశిస్తుంది. మనం చేసిన మంచి పనులే శాశ్వతం' అని నల్ల పక్షుల జట్టు నాయకుడు తోటి పక్షులకు చెప్పి ధైర్యాన్నిస్తూ ఉండేవారు.

ఒక రోజు తెల్ల పక్షుల జట్టు నాయకుడు నేలపై నడుస్తూ కేరింతలు కొడుతూ మైమరచి నృత్యం చేయసాగాడు. దాన్ని చూసిన మిగిలిన పక్షులూ నేల మీద దిగి గంతులేయసాగాయి. అక్కడ వేటగాళ్ళు పెట్టిన సన్నని వలలను ఆ పక్షులు గమనించకపోవడం వల్ల వాటి కాళ్ళు అందులో ఇరుక్కుపోయాయి.

ఆ రోజు వర్షం కురవడం వల్ల వేటగాళ్ళు రాలేదు. ఒకరోజల్లా ఆకలితో బిక్కుబిక్కుమని నిలువుకాళ్ళపై నిలబడ్డాయి. మరుసటిరోజు ఉదయాన్నే నల్ల పక్షులు అక్కడికి వచ్చి తమ బలమైన గోళ్ళతో రక్కి, ముక్కుతో కొరికి బంధవిముక్తుల్ని చేశాయి. ఆ తరువాత తమతో తెచ్చిన ఆహారాన్ని వాటికి తినిపించాయి.

అప్పుడు నల్ల పక్షుల నాయకుడు 'తెల్లగా ఉన్నంత మాత్రాన ఏ జాతి గొప్ప కాదు మిత్రమా! ఆపదలో ఉన్న వారిని ఆదుకున్న జాతి, ఆకలిగొన్నవారికి పట్టెడు మెతుకులు పెట్టే జాతి, తోటివారిని హేళన చేయకుండా వారి మనోభావాలను గౌరవించే జాతి, ఇతరుల కష్టాన్ని గుర్తించే జాతి గొప్పది' అని హితవు పలికాడు. ఆ రోజు నుంచి తెల్ల పక్షులు అన్ని జాతుల పక్షులతో స్నేహంగా మెలగసాగాయి.

- షేక్ అబ్దుల్ హకీం జాని
99494 29827



లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 169

నేను గీసిన బొమ్మ



- గుర్రం హాసిని,
8వ తరగతి,
రాయిలాపూర్,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



స్టాఫ్ నర్సుగా ఝాన్సీరాణి తన వృత్తి పట్ల గౌరవం, నిబద్ధతే తనను ఈ స్థాయికి తీసుకు వచ్చాయి. వైద్యసేవల్లో ఎప్పటికప్పుడు వచ్చే మార్పులు తెలుసుకుంటూ వృత్తిలో నైపుణ్యం సాధించారు. అత్యవసర వేళల్లో అంకితభావంతో పనివేళలతో సంబంధం లేకుండా సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో భర్త చనిపోయినా ఆ బాధను భరిస్తూనే రోగులకు ధైర్యాన్నిచ్చారు. ఇప్పుడు కూడా అర్ధరాత్రయినా సిబ్బందికి, రోగులకు ఫోన్లో స్పందిస్తూ సూచనలు ఇస్తారు. ఎంతోమందికి రక్తదానం అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. అందుకు గానూ ఆమెను 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు-2021' వరించింది.

మన నైటింగేల్

విజయవాడలో అయోధ్యనగర్‌కు చెందిన ఝాన్సీరాణి ఉద్యోగ కుటుంబానికి చెందిన వారు. తల్లి దేవి కృపామణి గృహిణి. తండ్రి ఆనంద పిళ్లై రైల్వే లోకో పైలెట్. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. రెండో కూతురు ఝాన్సీ. నానమ్మ, ముగ్గురు మేనత్తలు, వారి కుటుంబసభ్యులు, పిల్లలు అంతా కలిసే ఉండేవారు. బాల్యం నుంచీ ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నారు. దాంతో కుటుంబంలో ఏ సమస్య వచ్చినా, ఏ ఒక్కరూ అనారోగ్యానికి గురైనా, వృత్తి రీత్యా ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా ఒకరికొకరు తోడు నిలుస్తూ, సహకారం అందించుకుంటూ ఉండేవారు.

ఇటువంటి వాతావరణంలో పెరిగిన ఆమె ఇతరుల పట్ల సేవాగుణాన్ని అలవరుచుకున్నారు. చదువులోనూ, ఆటల్లోనూ ఎంతో చురుకుగ్గా ఉండేవారు. రైల్వేజోన్‌లో జరిగే కల్చరల్, క్రీడ విభాగాల్లో పాల్గొని ఎన్నో బహుమతులు సాధించారు. అక్క ప్రసన్నలక్ష్మి సూచన మేరకు ఇంటర్ తర్వాత బిఎస్సీ నర్సింగ్‌లో చేరారు. అమెరికన్ సెంటాన్స్ ఆఫ్ నర్సింగ్ కాలేజీలో పీబీ బీఎస్సీ(ఎన్) కోర్సు చేశారు. పాఠాలను ఎలా గుర్తుపెట్టుకోవాలి, ల్యాబ్ పరీక్షలు ఎలా చేయాలి, వృత్తి పట్ల ఎలా మసులుకోవాలి వంటి విషయాలను అక్క ఎప్పటికప్పుడు గైడ్ చేస్తూండేవారు. చదువు అయిన వెంటనే వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివ నాగేశ్వరరావును ఇంట్లో పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. విజయవాడ జీజీహెచ్‌లో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం వచ్చింది. వృత్తి బాధ్యతలు నిర్వహిస్తూనే ఇన్‌సర్వీస్ ఎడ్యుకేషన్ కింద భర్త ప్రోత్సాహంతో ఆమె చదువు కొనసాగించారు. బెంగుళూరు, చెన్నై నగరాల్లో మూడు, నాలుగు నెలల పాటు శిక్షణ తీసుకుని వృత్తిలో 13 సర్టిఫికేట్లు సాధించారు.

ఆయనే అన్నీ భరించారు

'ఉన్నత స్థాయిలో ఉన్న ఆడవాళ్లు సైతం పిల్లల్ని, కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. నేను అలా కాదు. పిల్లల్ని మాత్రమే నేను కన్నాను. పెంచింది మాత్రం ఆయనే. నేను చేసే వృత్తి చాలా గొప్పదని ఆయన ఎప్పటికీ భావించేవారు. అందుకే పిల్లల్ని పుట్టిన కొన్ని నెలలకే ఉద్యోగంలో చేరాను. అప్పటి నుంచి వాళ్ల అవసరాలు, చదువులు, ఉద్యోగంలో స్థిరపడే వరకూ అన్నీ ఆయనే బాధ్యతవహించారు. నన్నూ అలాగే చూసుకున్నారు. ఆయన ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూనే, ప్రతిరోజూ వంటచేసి, బాక్సు కట్టి, హాస్పటల్లో దించేవారు. నా డ్యూటీ అయిన వెంటనే వచ్చి తీసుకెళ్లేవారు. ఏ సమయంలోనైనా నా వెన్నంటే ఉన్నారు. పిల్లలకు నేను లేని లోటు తీర్చారు. దాంతో ఎటువంటి ఇబ్బందులూ, ఒత్తిడి లేకుండా వృత్తిలో క్రమశిక్షణతో విధులు నిర్వహించగలిగాను.' అని అంటారు ఝాన్సీ.

కీలక సమయాల్లోనూ...

విజయవాడ ఆసుపత్రిలో 25 ఏళ్లు ఐసీయూ, ట్రామా, ఎమర్జెంగ్, న్యూరో, బర్న్స్, లెప్రసీ, ఆంకాలజీ, బ్లడ్ బ్యాంకు, దిశా కౌన్సిలింగ్ సెంటర్...ఇలా అన్ని విభాగాల్లోనూ బాధ్యతలు నిర్వహించారు ఆమె. ఇంటి దగ్గర ఎన్ని పనులున్నా కాదనకుండా అవసరాన్నిబట్టి మూడు షిఫ్ట్‌ల్లోనూ పనిచేసేవారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు సిఎం కాన్వాయ్‌లో అంబెలెన్సులోనూ ఝాన్సీ విధులు నిర్వహించారు. ఒకసారి ఆయన ఎకోస్ప్రిన్ టాబ్లెట్, మందులు అడిగారు. అవి డాక్టర్ల దగ్గర లేదు. ఆ విషయం చెప్పడానికి అందరూ భయపడుతున్నారు. వెంటనే ఝాన్సీ సమయస్ఫూర్తితో వ్యవహరించారు. ఆ మందులను విజయవాడ ఆసుపత్రి నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టు సిబ్బంది ద్వారా వెంటనే తెప్పించి ఇచ్చారు. ఒకసారి బ్లడ్ బ్యాంకుకు ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి వచ్చారు. రక్తం తీసిన వెంటనే కళ్లు తిరిగి పడిపోయారు. అతని తల పగిలి రక్తం కారింది. చికిత్స చేసే డాక్టర్ అందుబాటులో లేకపోవడతో ఆమె దగ్గరుండి వైద్యం చేశారు. మరో ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్లి, తల స్కానింగ్ చేయించి ఏ ప్రమాదమూ లేదని నిర్ధారించిన తర్వాత వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పలువురు గర్భిణీలకు కాన్పు సమయంలో ధైర్యం చెప్పి, ఆపరేషన్ అయ్యే పరిస్థితి నుంచి మామూలు కాన్పు అయ్యేలా చేశారు. కొత్తగా వచ్చిన డాక్టర్లను, తోటి సిబ్బందికీ తల్లో నాలుకలా ఉండేవారు. ఇతర ప్రాంత్రాల్లో నిర్వహించే క్యాంపుల్లో వైద్యుల వెంట కీలక పాత్ర పోషించి 34 ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో జరిగే కల్చరల్, క్రీడా పోటీల్లో పాల్గొని బహుమతులూ సొంతం చేసుకున్నారు.





భర్త, అక్క చనిపోయినా

తన జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసిన అక్క ప్రసన్న లక్ష్మి, భర్త శివనాగేశ్వరావు ఫస్ట్ కోవిడ్ సమయంలో వైరస్ బారినపడ్డారు. పరిస్థితి విషమించి వెంటిలేటర్‌పై ఉంచారు. ఝాన్సీ ఏడుస్తూనే దగ్గరుండి వైద్యసేవలు చేశారు. తనను ఎంతగానో ప్రేమించిన వ్యక్తి తన చేతుల్లోనే తుదిశ్వాస విడవడంతో కృంగిపోయారు. తరువాతి వారం రోజుల్లో అక్కా చనిపోయారు. ఇంట్లో తీవ్ర విషాదం... మనసులో ఆ బాధను భరిస్తూనే ఆమె విధులు నిర్వర్తించి తోటి సిబ్బందికి స్ఫూర్తిగా నిలిచారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది మొత్తం భయపడిపోయారు. ఝాన్సీ మాత్రం అందరికీ ధైర్యం చెబుతూ, రోగులకు సేవలందించారు. ఆమె సేవలు, ప్రతిభను గుర్తించి విదేశాల్లోనూ అవకాశాలు వచ్చినా విజయవాడ ఆసుపత్రికి ప్రాధాన్యత ఇచ్చి ఇక్కడే ఉన్నారు.

'టీంలో ఒకరికి గుర్తింపు వచ్చిందంటే.. ఆ విజయం ఆ టీం మొత్తానిది. నర్సుగా నేను డ్యూటీలో ఉన్నప్పుడు మాత్రమే రోగికి సపర్యలు చేయగలుగుతాను. కాని ఆ తర్వాత వచ్చిన నర్సులు కూడా జాగ్రత్తగా చూసుకోబట్టే రోగులు త్వరగా కోలుకుని ఇంటికి వెళుతున్నారు. అందుకే ఈ గుర్తింపు అవార్డు మా ఆసుపత్రి వైద్యసిబ్బంది అందరిదీ' అంటారు ఝన్సీ.

- పద్మావతి



సంక్రాంతికే 'వీర సింహారెడ్డి'

బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'వీర సింహారెడ్డి' తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. జనవరి 12న ఈ సినిమా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధంగా ఉంది. గోపీచంద్ మలినేని డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో శ్రుతిహాసన్ కథానాయిక. దునియా విజయ్, వరలక్ష్మి శరత్‌కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.


నేనెంతో గర్విస్తున్నా...



రామ్‌చరణ్‌కి ట్రూ లెజెండ్ అవార్డు రావడం పట్ల చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ఎమోషనల్ ట్వీట్ చేశారు. 'కంగ్రాట్స్ డియర్ చరణ్. ఫ్యూచర్ ఆఫ్ యంగ్ ఇండియాలో ట్రూ లెజెండ్ అవార్డు నువ్వు అందుకున్నందుకు నేనెంతో గర్విస్తున్నా. నువ్వు ఇలాగే ముందుకు సాగాలని అమ్మా నేను కోరుకుంటున్నాం.' అని చిరు ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కి చరణ్ స్పందిస్తూ.. 'లవ్ యూ అప్పా' అని రిప్లై ఇచ్చారు. ప్రముఖ ఆంగ్ల పత్రికా సంస్థ ఇటీవల వివిధ రంగాల్లో విశేషమైన సేవలను అందించిన పలువురు ప్రముఖులకు ఫ్యూచర్ ఆఫ్ యంగ్ ఇండియా అవార్డులను అందజేసింది. ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో రామ్‌చరణ్‌కి ట్రూ లెజెండ్ అవార్డు లభించింది. ఈ అవార్డును చరణ్ తన తండ్రి చిరంజీవికి అంకితం చేశారు.

క్వార్టర్స్‌కు నెదర్లాండ్స్

ప్రి క్వార్టర్స్‌లో అమెరికాపై 3-1గోల్స్‌తో గెలుపు



దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 క్వార్టర్‌ఫైనల్లోకి నెదర్లాండ్స్ జట్టు దూసుకెళ్లింది. శనివారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో నెదర్లాండ్స్ జట్టు 3-1గోల్స్ తేడాతో అమెరికాను ఓడించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికే నెదర్లాండ్స్ జట్టు 2-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. రెండో అర్ధభాగం 76వ ని.లో హాజీ రైట్ ఒక గోల్ కొట్టడంతో నెదర్లాండ్స్ ఆధిక్యత 2-1కి తగ్గింది. ఆ తర్వాత నెదర్లాండ్స్ జట్టు డెన్జెల్(81వ ని.) మరో గోల్ కొట్టడంతో నెదర్లాండ్స్ జట్టు తిరుగులేని 3-1గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. నెదర్లాండ్స్ డిఫెన్స్ ఛేదించడంలో అమెరికాజట్టు విఫలమైంది. దీంతో ఫిఫా ప్రపంచకప్-2022లో క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లిన తొలి జట్టుగా నెదర్లాండ్స్ నిలిచింది. తొలి రెండో గోల్స్‌ను మెంఫిస్(10వ ని.), డెలే (45+1వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. అర్జెంటీనా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మరో ప్రి క్వార్టర్స్ మ్యాచ్ విజేతతో నెదర్లాండ్స్ జట్టు క్వార్టర్‌ఫైనల్లో తలపడనుంది.

ఓ సంచలనంతో కామరూన్...

గ్రూప్-జిలో కామరూన్ జట్టు పెను సంచలనాన్ని నమోదుచేసింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో కామరూన్ జట్టు 5సార్లు ఫిఫా ప్రపంచకప్ ఛాంపియన్ బ్రెజిల్‌ను ఓడించింది. కామరూన్ తరఫున ఏకైక గోల్‌ను విన్సెంట్ 92వ నిమిషంలో చేశాడు. గోల్ కొట్టిన ఆనందంలో విన్సెంట్ అతని జెర్సీని విప్పి సంబరాలు చేసుకోవడంతో అతను రెడ్‌కార్డ్‌కు గురై మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఆ తర్వాత బ్రెజిల్ పోరాడినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ గ్రూప్ నుంచి సెర్బియా, స్విట్జర్లాండ్ జట్లు 6పాయింట్లతో టాప్-2లో నిలిచి ప్రి క్వార్టర్‌ఫైనల్‌కు ప్రవేశించాయి.

ప్రి క్వార్టర్‌ఫైనల్స్ షెడ్యూల్..

డిసెంబర్ 4: ఫ్రాన్స్ × పోలండ్(రా. 8.30గం॥లకు)
ఇంగ్లండ్ × సెనెగల్(రా. 12.30గం॥లకు)
డిసెంబర్ 5: జపాన్ × క్రొయేషియా(రా. 8.30గం॥లకు)
బ్రెజిల్ × దక్షిణ కొరియా(రా. 12.గం॥లకు)
డిసెంబర్ 6: మొరాకో × స్పెయిన్(రా. 8.30గం॥లకు)
పోర్చుగల్ × స్విట్జర్లాండ్(రా. 12.30గం॥లకు)


బ్రెజిల్‌పై గోల్ కొడుతున్న కామరూన్ ఆటగాడు విన్సెంట్


జెర్సీ తీసేయడంతో రెడ్‌కార్డ్ చూపుతున్న రిఫరీ

నాకౌట్ బెర్త్‌లు ఖరారు



దోహా: ఫిఫా ప్రపంచకప్-2022లో గ్రూప్ దశ లీగ్ పోటీలు ముగిసాయి. శుక్రవారం రాత్రి బ్రెజిల్-కామరూన్ జట్ల మధ్య జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌తో ఈ సీజన్ ఫిఫా గ్రూప్ లీగ్ పోటీలు ముగిసాయి. 8గ్రూపుల ఫిఫా గ్రూప్ పోటీల్లో ఆతిథ్య కతార్‌తోపాటు ఆసియా ఖండానికి చెందిన ఇరాన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, జపాన్ జట్లు సంచలన విజయాలను నమోదు చేసుకున్నాయి. గ్రూప్-సి తొలి లీగ్ పోటీలోనే సౌదీ అరేబియా జట్టు 2-1గోల్స్ తేడాతో అర్జెంటీనాకు ఓడించి పెను సంచలనాన్ని నమోదు చేయగా.. ఆ తర్వాత జపాన్ జట్టు జర్మనీని చిత్తుచేసి మరో సంచలనాన్ని తెరలేపింది. ఇదే క్రమంలో దక్షిణ కొరియా జట్టు ఉరుగ్వేలతో మ్యాచ్‌ను డ్రా చేసుకొని ఫేవరెట్ జట్లలో ఒకటిగా నిలిచింది. ఆతిథ్య కతార్ మినహా.. ఆసియా ఖండానికి చెందిన మిగిలిన నాలుగు జట్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత సౌదీ అరేబియా, ఇరాన్ జట్లు పోరాడినా ప్రి క్వార్టర్స్‌కు చేరడంలో విఫలమైతే.. చివరి లీగ్ మ్యాచుల్లో జపాన్ జట్టు స్పెయిన్‌ను, దక్షిణ కొరియా జట్టు పోర్చుగల్‌ను ఓడించి ఏకంగా నాకౌట్‌కు చేరకున్నాయి.

లీగ్ దశలోనే నిష్క్రమించిన ఫేవరెట్ జట్లు..

లీగ్ దశలోనే ఈసారి టాప్‌క్లాస్ జట్లు నిష్క్రమించాయి. గ్రూప్-సిలో మెక్సికోతోపాటు, గ్రూప్ ఆఫ్ డెత్‌గా పరిగణించిన గ్రూప్-డిలో ట్యునీషియా, డెన్మార్క్ జట్లు లీగ్ దశను దాటలేకపోయాయి. అలాగే గ్రూప్-ఇ నుంచి మాజీ ఛాంపియన్ జర్మనీ, గ్రూప్-ఎఫ్‌లో బెల్జియంతోపాటు గ్రూప్-జి నుంచి కామరూన్, గ్రూప్-హెచ్ నుంచి మాజీ ఛాంప్ ఉరుగ్వే లీగ్ దశను దాటలేకపోయింది. ఈ జట్లన్నీ తొలి మ్యాచ్‌లో ఓటమి ఆ జట్టు నాకౌట్ బెర్త్ చేరికపై ప్రభావాన్ని చూపాయని చెప్పుకోవచ్చు. శనివారం నుంచి ప్రి క్వార్టర్‌ఫైనల్ పోటీలు ప్రారంభం కాగా.. 9నుంచి క్వార్టర్‌ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

యువ క్రికెటర్లకు సదవకాశం

బంగ్లాదేశ్‌తో తొలి వన్డే నేడు
షమీ ఔట్.. ఉమ్రన్ ఇన్..
ఉదయం 11.30గం॥ల నుంచి

ఢాకా: టీమిండియా జట్టు బంగ్లాదేశ్ పర్యటనలో భాగంగా ఆదివారం నుంచి మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఇరుజట్ల మధ్య జరిగే తొలి వన్డేకు ఢాకాలోని షేర్ బంగ్లా నేషనల్ స్టేడియంలో జరగనుంది. వన్డే సిరీస్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా సీనియర్ పేసర్ షమీ ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. భుజం గాయంతో షమీ ఇబ్బందిపడుతున్నట్లు బిసిసిఐ శనివారం ట్విట్టర్‌లో వెల్లడించింది. షమీ స్థానంలో భారత యువ పేసర్ ఉమ్రాన్ మాలిక్‌కు జట్టులో చోటు కల్పించినట్లు పేర్కొంది. 'బంగ్లాతో వన్డే సిరీస్‌కు ముందు నిర్వహించిన ట్రైనింగ్ సెషన్‌లో షమీకి గాయమైంది. అతడు ప్రస్తుతం ఎన్సీఏ పర్యవేక్షణలో ఉన్నాడు. బంగ్లాదేశ్‌కు వెళ్లిన జట్టుతో అతడు వెళ్లలేదు' అని బిసిసిఐ తెలిపింది. వన్డే సిరీస్ ముగిసిన అనంతరం 14 నుంచి రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది.


వన్డే సిరీస్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న భారత్, బంగ్లాదేశ్ కెప్టెన్లు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram - 515004, A.P State, Ph.08554 -290484,
and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram-515004, Editor : Bendi Tulasi Das, Ph.9490099275, email: editorprajasakthi@gmail.com, RNI Regd .No. APTEL/2019/78422